సాక్షి రంగారెడ్డి

బుధవారం । 12 । మార్చి । 2025



ఆ లింక్‌లు ఓపెన్ చేయొద్దు

ఆఫర్ల పేరుతో వచ్చే తెలియని లింక్‌లని ఓపెన్ చేసి మోసపోవద్దని రిజర్వు బ్యాంకు అధికారులు సూచించారు. 10లో▸



సొంతూరికి వెళ్లొచ్చే సరికే..

ఇంటి తాళాలు పగులగొట్టిన దుండగులు జీరువాలోని బంగారు, వెండి ఆభరణాలతో పాటు నగదు దోచుకెళ్లారు. 10లో▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
బుధవారం సా. 6.31 గం.	గురువారం ఉ. 5.04 గం.

న్యూస్‌రీల్

మైసమ్మ సన్నిధిలో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు



మైసిగండి మైసమ్మను దర్శించుకున్న హుస్సేన్ నాయక్ తదితరులు

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి మైసమ్మను జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్ మంగళవారం ఉదయం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హుస్సేన్ నాయక్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అంతకు ముందు కడ్తాల్ మండల కేంద్రంలో హుస్సేన్‌నాయక్‌కు బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు దోనాదుల మహేశ్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం మండల కేంద్రంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాగి అంబలి కేంద్రాన్ని ఆయన సందర్శించారు. కార్యక్రమంలో బీజేపీ గిరిజన మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు కల్యాన్ నాయక్, జిల్లా గిరిజన మోర్చ అధ్యక్షుడు సాయిలాల్‌నాయక్, జిల్లా నాయకులు రాందాస్‌నాయక్, భగీరథ్, శ్రీశైలంగౌడ్, కుమార్, మునేశ్, రెడ్యానాయక్, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలి



పట్టుబడిన వాహనాలను పరిశీలిస్తున్న డీసీపీ రాజేశ్

ఆమనగల్లు: పోలీసులు ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలని శంషాబాద్ డీసీపీ రాజేశ్ సూచించారు. పోలీసు స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా మసలుకోవాలని అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని పోలీసుస్టేషన్‌ను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ పరిసరాలు, వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను, పోలీసుస్టేషన్‌లో కేసుల రికార్డులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆమనగల్లు సీఐ ప్రమోద్‌కుమార్, ఎస్‌ఐలు వెంకటేశ్, సీతారాంరెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బాటసింగారంలో పోలీస్ ఔట్ పోస్టు ఏర్పాటు చేయండి



సీపీ సుధీర్‌బాబుకు వినతిపత్రం ఇస్తున్న మధుసూదన్‌రెడ్డి తదితరులు

అబ్దుల్లాపూర్ మెట్: మామిడి సీజన్ దృష్ట్యా బాటసింగారంలోని పండ్ల మార్కెట్లో పోలీస్ ఔట్ పోస్ట్ ఏర్పాటు చేయాలని కోరుతూ గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, పాలకవర్గం సభ్యులు మంగళవారం రాచకొండ సీపీ జి. సుధీర్బాబుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. మామిడి సీజన్ కావడంతో దిగుమతులు భారీగా ఉంటాయని, క్రయ విక్రయాలు, నగదు లావాదేవీలు అధికంగా జరుగుతాయని తెలిపారు. మార్కెట్లో చోరీలు జరిగే ఆస్కారం ఉందన్నారు. అంతే కాకుండా కొంత మంది బ్రోకర్లతో కుమ్మక్కై మార్కెట్ బయట వ్యాపారం చేస్తూ పండ్లు అక్రమంగా అమ్ముతున్నారని, మార్కెట్ ఆదాయానికి గండి పడుతోందని అన్నారు. ఇలాంటి వారిపై నిఘా ఉంచి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ సీహెచ్ భాస్కరచారి, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎల్.శ్రీనివాస్, పాలకవర్గ సభ్యులు వన్యాల జైపాల్ రెడ్డి, మెగావత్ గణేశ్ నాయక్, రఘుపతిరెడ్డి, దోమలపల్లి, అంజయ్య, వెంకటేశ్వర్లు, గుప్తా తదితరులు పాల్గొన్నారు.

సర్కారు వైద్యం బేజారు

సేవలు అంతంతే..

- సమయపాలన పాటించని వైద్యులు, సిబ్బంది
- అరకొర మందుల పంపిణీ
- పరీక్షలకు విషమ 'పరీక్షే'..
- గంటల తరబడి రోగుల నిరీక్షణ

సర్కారు దవాఖానాల్లో రోగులకు పాట్లు తప్పడం లేదు.. మంగళవారం ఉదయం జిల్లాలోని పలు ఆస్పత్రుల్లో 'సాక్షి' విజిట్ చేసింది.. రోగులకు వైద్య సేవలు అందించాల్సిన సిబ్బంది సమయ పాలన పాటించడం లేదు. ఉదయం 9 గంటలకే వైద్యులతోపాటు సిబ్బంది రావాల్సి ఉండగా తీరిగ్గా 10 గంటల తరువాతే వస్తున్నారు.. వైద్యుల కోసం బాధితులు గంటల తరబడి నిరీక్షించడం కనిపించింది.. మరికొన్ని చోట్ల సిబ్బంది కొరత వేధిస్తోంది.. ఇక మందుల కొరత.. టెస్టులు సరేసరి..

వైద్యుల కోసం నిరీక్షణ

కందుకూరు: కందుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించడంలేదు. ఉదయం 10 గంటలకు ఆయుష్‌కు చెందిన అటెండర్ మాత్రమే విధుల్లో ఉన్నాడు. బయట కొందరు రోగులు నిరీక్షిస్తున్నారు. వైద్యులు కానీ నర్సులు కానీ ఇతర ఉద్యోగులు కానీ ఎవరూ అందుబాటులో లేరు. పది గంటల తర్వాత ఒక్కొక్కరుగా వచ్చారు.



కందుకూరు పీహెచ్‌సీ ఎదుట వైద్యుల కోసం నిరీక్షిస్తున్న రోగులు, వారి కుటుంబీకులు

ఉదయం 8.20 గంటల నుంచి..



మా కుమారుడిని కుక్క కరిచింది. కడ్తాల్ నుంచి కందుకూరుకు ఉదయం 8.20 గంటలకు వచ్చాము. 10 గంటలకు కూడా చికిత్స చేయడానికి ఎవరూ లేరు. డాక్టర్ల కోసం ఎదురుచూస్తున్నాం.

– రూప్‌సింగ్, కడ్తాల్

ఉదయం 9.30 దాటినా..

మొయినాబాద్: మున్సిపల్ కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉదయం 9.30 గంటలకు ఎవరూ కనిపించలేదు. ఒక్క స్వీపర్ మాత్రం ఆస్పత్రి తాళాలు తీసి ఊడుస్తున్నారు. వైద్యాధికారి ఇంటర్ పరీక్ష కేంద్రాలకు వెళ్లినట్లు తెలిసింది. మిగతా వైద్య సిబ్బంది ఎవరూ లేకపోవడంతో వచ్చిన రోగులు బయట వేచిచూస్తూ కూర్చున్నారు. ఉదయం 10 గంటల తరువాత ఒక్కొక్కరుగా ఆస్పత్రికి వచ్చారు.



పీహెచ్‌సీలో తెరుచుకోని ఫార్మసీ సబ్‌స్టోర్

ఖాళీగానే వైద్యురాలి కుర్చీ

నందిగామ: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఉదయం 11 గంటలు దాటినా వైద్యురాలి కుర్చీ ఖాళీగా దర్శనమిచ్చింది. మరో డ్యూటీ డాక్టర్ రోగులను పరీక్షిస్తున్నారు. ప్రతి రోజు సుమారు 60 నుంచి 70 మందికి పరీక్షలు నిర్వహిస్తున్నామని, మందుల కొరత లేదని సిబ్బంది తెలిపారు.



సమయపాలన కరువు



ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

మంచాల: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమయపాలన పాటించడం లేదు. ఇక్కడ ఒక డాక్టర్, ఇద్దరు స్టాఫ్ నర్స్‌లు, ఒక ఫార్మాసిస్టు, సీనియర్ అసిస్టెంట్, హెల్త్ అసిస్టెంట్, ఒక అంటెండర్, ఇద్దరు సూపర్‌వైజర్లు, ఐదుగురు ఏఎన్‌ఎంలు పని చేస్తున్నారు. సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు ఫీల్డ్ విజిట్ నిర్వహిస్తున్నామని చెబుతున్నారు. మిగతా వారు ఉదయం 10.20 గంటలు దాటినా రాలేదు. ఇక్కడ పని చేసే డాక్టర్ రాకపోవడంతో లింగంపల్లిలో విధులు నిర్వర్తించాల్సిన పల్లె దవాఖాన డాక్టర్ వైద్యసేవలు అందించారు.

10.30 గంటల తర్వాత

యాచారం: మండల కేంద్రంలోని సీహెచ్‌సీ కేంద్రానికి ఉదయం 10.30 గంటల తర్వాత ముగ్గురు వైద్యులు వచ్చారు. అప్పటికే రోగులు వచ్చి వేచి చూస్తున్నారు. మధ్యాహ్నం వరకు 140 మంది వరకు కాళ్లు, కీళ్ల నొప్పులు, బీపీ, షుగర్ వ్యాధులతో బాధపడుతూ ఆస్పత్రికి వచ్చారు. వారికి పరీక్షలు నిర్వహించి కావాల్సిన మందులు ఇచ్చి పంపించారు. వైద్య పరీక్షలకు అనుగుణంగా మందులు అందుబాటులో ఉన్నాయని వైద్యురాలు రాజ్యలక్ష్మి తెలిపారు.



వైద్య పరీక్షల కోసం వచ్చిన రోగులు



తుక్కుగూడ బస్తీ దవాఖానలో సేవలు అందిస్తున్న డాక్టర్

అరకొర మందులు

తుక్కుగూడ: పురపాలక సంఘం పరిధిలోని తుక్కుగూడ, మంఖాల్‌లో బస్తీ దవాఖానలు ఉన్నాయి. వీటిలో ఒక డాక్టర్, ఒక నర్సు విధులు నిర్వర్తిస్తున్నారు. రోజుకు ప్రతి దవాఖానలో 50 మందికిపైగా ఓపీ సేవలను వినియోగించుకుంటున్నారు. పూర్తి స్థాయిలో మందుల పంపిణీ జరగడం లేదు. ఆస్పత్రులకు వచ్చిన వారు వైద్యులు సూచించే మందులను ప్రైవేటు మెడికల్ షాపుల నుంచి కొనుగోలు చేస్తున్నారు.

ఓపీ ఎక్కువ.. సిబ్బంది తక్కువ

బడంగ్‌పేట్: కార్పొరేషన్‌లోని పట్టణ అర్బన్ వైద్య కేంద్రంలో ఉదయాన్నే డాక్టర్ అందుబాటులోకి వచ్చారు. 12 గంటల వరకు 130కిపైగా రోగులు బీపీ, షుగర్, ఇతర పరీక్షలు చేయించుకున్నారు. రోగుల రద్దీకి అనుగుణంగా సిబ్బంది లేక ఇబ్బంది పడడం కనిపించింది.



బడంగ్‌పేట్‌లో ఓపీ సేవల్లో వైద్యుడు

కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగే దిక్కు

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం మండలం, ఆదిబట్ల మున్సిపాలిటీల పరిధిలో బస్తీ దవాఖాన, పల్లె దవాఖానాల్లో పర్మినెంట్ ఉద్యోగులు లేరు. వైద్యులను కాంట్రాక్టు పద్ధతిలో, సపోర్టింగ్ స్టాఫ్, ఏఎన్‌ఎం, జీఎన్‌ఎం, ల్యాబ్ టెక్నీషియన్లను ఔట్‌సోర్సింగ్ విధానంలో నియమించారు. వైద్యులు రాని చోట ఏకంగా స్టాఫ్ నర్సులే దిక్కవుతున్నారు. రక్తం, మూత్ర పరీక్షల కోసం ఎదురు చూపులు తప్పడం లేదు. వైద్యం సరిగా అందక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



శేరిగూడ బస్తీ దవాఖానాలో సపోర్టింగ్ స్టాఫ్ సెలవుపై వెళ్లడంతో స్వయంగా మందులు ఇస్తున్న డాక్టర్

సిబ్బంది కొరతతో ఇబ్బంది

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రెగ్యులర్ డాక్టర్ సెలవుపై వెళ్లగా ఇన్‌చార్జి డాక్టర్ విధులు నిర్వర్తిస్తున్నారు. ఆస్పత్రిలో సీహెచ్‌ఓతో పాటు ఒక స్టాఫ్ నర్స్ మాత్రమే విధుల్లో ఉన్నారు. ఒంటి నొప్పులు, బలహీనత, సాధారణ జ్వరంతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. తీవ్ర జ్వరంతో బాధపడే రోగులకు రక్త పరీక్షల కోసం రక్తాన్ని సేకరించి టీహబ్‌కు పంపిస్తున్నారు. రిపోర్టుల కోసం మరుసటి రోజు వరకు వేచి చూడాల్సి వస్తోంది. ఒక్కరే వైద్యులు ఉండటంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు.



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్

పరీక్షల కోసం ప్రైవేటుకు..

కొత్తూరు: మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యులు విధులు నిర్వర్తించాల్సి ఉండగా ఒకరు మాత్రమే కొనసాగుతున్నారు. ఆయన కూడా విధుల నిమిత్తం ఆయా గ్రామాల్లో ఉన్న సబ్ సెంటర్లు, ఇతర కార్యక్రమాల్లో పాల్గొనడానికి వెళ్లిన సందర్భంలో రోగులకు ఇబ్బంది ఎదురవుతోంది. ఆస్పత్రిలో కొన్ని నెలలుగా ఆయుష్ వైద్యుడి పోస్టు ఖాళీగా ఉంది. రెండు రోజులుగా ల్యాబ్‌టెక్నీషియన్ లీవ్‌లో ఉండడంతో బాధితులు బయట డయాగ్నొస్టిక్స్‌లో పరీక్షలు చేయించుకుంటున్నారు. తరచూ అవసరమయ్యే ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ పరీక్షలు పీహెచ్‌సీలో అందుబాటులో లేవు. డబ్బులు ఖర్చు చేసి ప్రైవేట్‌లో చేయించుకోవాల్సి వస్తోంది.



వైద్యుడు లేకపోవడంతో ఆస్పత్రిలో కనిపించని రోగులు

ఫార్మాసిటీనా.. ఫ్యూచర్ సిటీనా?

- ఏది ఏర్పాటు చేస్తారో స్పష్టత ఇవ్వాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

యాచారం: ఫార్మాసిటీనా.. ఫ్యూచర్ సిటీనా.. సర్కార్‌కు దేనిపైనా స్పష్టత లేదని, ఫార్మాసిటీని రద్దు చేసినట్లయితే సేకరించిన భూములను తిరిగి రైతులకు ఇచ్చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫార్మాసిటీ భూ బాధితుల సమస్యలపై మంగళవారం కుర్మిద్ద గ్రామంలో నిర్వహించిన సదస్సుకు హాజరైన ఆయన మాట్లాడుతూ.. ఫార్మాసిటీ ఏర్పాటు పేరుతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం బలవంతంగా భూసేకరణ చేసిందన్నారు. రైతుల అంగీకారం లేకుండానే నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో 800 మందికి చెందిన 2,200 ఎకరాల పట్టా భూములను ఫార్మా కోసం తీసుకుంటున్నట్లు ప్రకటించి, రాత్రికి రాత్రే ధరణి పోర్టల్‌లో టీఎస్‌ఐఐసీ అని మార్చారని గుర్తుచేశారు. ఈ విషయమై బాధితులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో ధరణి పోర్టల్‌లో టీఎస్‌ఐఐసీ పేరు తీసేసి రైతుల పేర్లు నమోదు చేయాలని హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులకు యంత్రాంగం స్పందించడం లేదని మండిపడ్డారు. ఫార్మా భూ బాధితుల విషయాన్ని అసెంబ్లీలో చర్చించి, న్యాయంచేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు. ఇందుకోసం వారం రోజులు గడువు ఇస్తున్నామని, లేదంటే ఈనెల 20న ఫార్మా గ్రామాల నుంచి పాదయాత్ర ప్రారంభించి, 21న కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని ప్రకటించారు. తర్వాత ఏం జరిగినా సర్కారే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఫార్మాసిటీకి భూములు తీసుకున్నందుకు గాను ఎకరాకు 121 గజాల ప్లాటు బదులు ఎకరాకు 500 గజాల ప్లాట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఫార్మాసిటీ, ఫ్యూచర్ సిటీ పేరుతో రైతుల నుంచి వేలాది ఎకరాల భూములను సేకరించాలని చూస్తున్న సర్కార్.. వీటిని కోట్లాది రూపాయలకు బడా పారిశ్రామికవేత్తలకు అమ్ముకోవడం ఖాయమన్నారు. ఎన్ని పరిశ్రమలు వచ్చినా.. ఎన్ని ప్రాజెక్టులు వచ్చినా రైతులకేమీ ఉపయోగం ఉండదని తెలిపారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలేసి నివాళులర్పించారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, యాచారం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ, జిల్లా కమిటీ సభ్యులు రాంచందర్, పి.అంజయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.మధుసూదన్‌రెడ్డి, న్యాయవాది అరుణకుమార్, నాయకులు పెద్దయ్య, జగన్, బ్రహ్మయ్య, తావునాయక్, విప్లవ్‌కుమార్, ఆలంపల్లి జంగయ్య తదితరులు పాల్గొన్నారు.



కుర్మిద్దలో జరిగిన ఫార్మా భూ బాధితుల సదస్సులో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

సింబయాసిస్‌లో విద్యార్థి మృతి

- యూనివర్సిటీ ఎదుట స్థానికుల ఆందోళన
- యాజమాన్యం విద్యార్థులను పట్టించుకోవడం లేదని ఆరోపణ

నందిగామ: అనుమానాస్పద స్థితిలో ఓ విద్యార్థి మృతిచెందిన ఘటన మండల పరిధిలోని మొదళ్లగూడ శివారు సింబయాసిస్ అంతర్జాతీయ విశ్వవిద్యాలయంలో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ గోపాల కృష్ణ కథనం ప్రకారం వివరాలు.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం గజియాబాద్, సంఘంనగర్‌కు చెందిన శాగనిక్‌బాసు (21) యూనివర్సిటీ హాస్టల్‌లో ఉంటూ బీఏ ఎల్‌ఎల్‌బీ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం అర్ధరాత్రి సుమారు 1.30 గంటల ప్రాంతంలో తన గదిలోని బాత్‌రూంలోకి వెళ్లి, చాలా సేపైనా బయటకు రాలేదు. దీంతో స్నేహితులు రోహిత్, హర్షిత్ పాండేలు బాత్‌రూం వెంటిలేటర్ నుంచి చూడగా అపస్మారక స్థితిలో కిందపడిపోయి ఉన్నాడు. దీంతో తలుపును బద్దలు కొట్టి అతన్ని క్యాంపస్‌లో వైద్యుడి వద్దకు తీసుకెళ్లారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం శంషాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు బాసు మృతి చెందినట్లు ధ్రువీకరించారు. దీంతో మృతదేహాన్ని హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి పార్థబాసు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



శాగనిక్ బాసు (ఫైల్)

స్థానికుల ఆందోళన..

విద్యార్థి మృతి చెందిన విషయం తెలుసుకున్న స్థానికులు మంగళవారం వర్సిటీ ఎదుట ఆందోళనకు దిగారు. విద్యార్థులను యాజమాన్యం పట్టించుకోకపోవడంతో మత్తు పదార్థాలు తీసుకుని బయటకు వచ్చి న్యూసెన్స్ చేస్తున్నారని ఆరోపించారు. విద్యార్థి మృతిపై అనుమానాలున్నాయన్నారు. ఈ విషయమై వర్సిటీ డైరెక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ.. విద్యార్థి గుండెపోటుతో మృతిచెందాడని ప్రాథమిక సమాచారం అందిందని, పోస్టుమార్టం నివేదిక వచ్చాక పూర్తి విషయాలు తెలుస్తాయని చెప్పారు.

అసమానతలు లేని ఆర్థిక వ్యవస్థ కావాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

తుక్కుగూడ: దేశంలో ఆర్థిక లేని వ్యవస్థ కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఆపార్టీ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. పార్టీ శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం తుక్కుగూడలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో సెమినార్ నిర్వహించారు. అంతకు ముందు కార్మికులు, కర్షకులతో కలిసి ఔటర్ రింగు రోడ్డు హాల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చిన అనంతరం నిరుపేదల ఆర్థిక వ్యవస్థ పూర్తిగా దిగజారిందన్నారు. ఇదే సమయంలో కార్పొరేట్ శక్తుల ఆదాయం వందరెట్లు పెరిగిందని ఆరోపించారు. దేశంలో జీఎస్టీ వసూలు పేరుతో పేదలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ఖనిజ సంపదను పూర్తిగా బడా కంపెనీలకు దోచి పెడుతున్నారన్నారు. మతతత్వ బీజేపీపై పోరాడేందుకే తాము కాంగ్రెస్ పార్టీతో జత కట్టామని స్పష్టంచేశారు. దేశంలోని నిరుపేదలు, కార్మికులు, కర్షకుల కోసం అలుపెరుగని పోరాటం చేస్తున్నది కమ్యూనిస్టు పార్టీ మాత్రమేనని వెల్లడించారు. ప్రముఖ జర్నలిస్టు పాశం యాదగిరి మాట్లాడుతూ.. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో ప్రజాస్వామికవాదులు, కవులు, కళాకారులపై దాడులు, హత్యలు జరుగుతునయన్నారు. ఈ కార్యక్రమంలో ఆపార్టీ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రచారి, నాయకులు పుస్తకాల నర్సింగ్‌రావు, పానుగంటి పర్వతాలు, యాదిరెడ్డి, దత్తునాయక్, నర్సింహ్మా, యాదయ్య, పార్టీ శ్రేణులు, కార్మికులు, పాల్గొన్నారు.



తుక్కుగూడలో ర్యాలీ తీస్తున్న సీపీఐ నేతలు, కార్మికులు

పాత్రికేయులు క్రమశిక్షణతో మెలగాలి

- ఐజేయూ మాజీ అధ్యక్షుడు దేవులపల్లి అమర్
- టీయూడబ్ల్యూజే జిల్లా ద్వితీయ మహాసభలు


సభలో ప్రసంగిస్తున్న అమర్

శంకర్‌పల్లి: మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పాత్రికేయులు సైతం క్రమశిక్షణతో మెలగాల్సిన అవసరం ఉందని ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్(ఐజేయూ) మాజీ అధ్యక్షుడు దేవులపల్లి అమర్, ఐజేయూ ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. మంగళవారం శంకర్‌పల్లి మండలం ప్రొద్దటూరులోని ప్రగతి రిసార్ట్స్‌లో టీయూడబ్ల్యూజే జిల్లా ద్వితీయ మహాసభలు నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథులుగా వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా దేవులపల్లి అమర్ మాట్లాడుతూ.. ఈ జర్నలిస్ట్ యూనియన్ 1957లో ప్రారంభించారని, ప్రస్తుతం ఎన్ని కొత్త యూనియన్లు వచ్చినా.. పద్ధతి ప్రకారం నడిచేది టీయూడబ్ల్యూజే మాత్రమేనని స్పష్టం చేశారు. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జర్నలిస్టుల స్వేచ్ఛకు భంగం కల్గిస్తోందని, యూనియన్ల ప్రతిష్టను దిగజార్చుతుందన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టులకు హామీలు ఇవ్వడం తప్ప.. అమలు చేసింది లేదన్నారు. బీఆర్ఎస్ నేత కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ.. జర్నలిస్టులతో తనకు అనుబంధముందని, ఇదే ధోరణిని మున్ముందు కొనసాగిస్తానని తెలిపారు. అనంతరం వివిధ ప్రతికల్లో 25 ఏళ్లకు పైగా సేవలందించిన పాత్రికేయులందరికీ టీయూడబ్ల్యూజే తరఫున సన్మానించారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు సలీం పాషా తదితరులు పాల్గొన్నారు.

టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడిగా సలీం పాషా



టీయూడబ్ల్యూజే రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా శంకర్‌పల్లి పట్టణానికి చెందిన ఎండీ.సలీం పాషా, ప్రధాన కార్యదర్శిగా మేకల సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు జిల్లా ద్వితీయ మహాసభల్లో ప్రకటించారు. జర్నలిస్టు నాయకులు సలీంకు శుభాకాంక్షలు తెలిపారు. ఇదివరకు అధ్యక్షుడిగా పని చేసిన శ్రీకాంత్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు.

మల్లన్న సాగర్ టు మూసీ!

- గోదావరి నుంచి 20 టీఎంసీల నీళ్లు తరలింపు
- ఇందులో 5 టీఎంసీల నీటితో మూసీ శుద్ధి
- నదిపై 11 హెరిటేజ్ వంతెనల నిర్మాణం
- గాంధీ సరోవర్ లాగే బాపూఘాట్ అభివృద్ధి
- కేంద్రాన్ని రూ.14,100 కోట్ల ఆర్థిక సాయాన్ని కోరిన సర్కారు



సాక్షి, సిటీబ్యూరో: మూసీ పునరుజ్జీవానికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. కంపుకొట్టే మూసీ నదిని సుందరీకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు అధికారులు కార్యాచరణ వేగవంతం చేశారు. మూసీ ఆక్రమణలతో పాటు నది శుద్ధి కోసం కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా మల్లన్నసాగర్ నుంచి హైదరాబాద్‌కు 20 టీఎంసీల నీటిని తరలించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో 5 టీఎంసీల నీటిని మూసీ నది శుద్ధి కోసం..15 టీఎంసీల నీటిని హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం వినియోగించాలని సీఎం నిర్ణయించారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన మల్లన్నసాగర్ నుంచి ప్రత్యేక పైప్‌లైన్ల ద్వారా నీటిని మళ్లించేలా పనులు చేపట్టనున్నారు. గోదావరి నుంచి 5 టీఎంసీల నీటిని మూసీ పునరుజ్జీవం కోసం హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్‌లకు మళ్లించి, శుద్ధి చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే గోదావరి–మూసీ అనుసంధానం కోసం కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖకు లేఖ రాశారు.

రూ.14,100 కోట్ల ఆర్థిక సాయం..

ఒకప్పుడు భాగ్యనగర వాసుల తాగునీటి అవసరాలను తీర్చిన మూసీ నది..కాలక్రమంలో గృహ, పారిశ్రామిక వ్యర్థాల పారబోతతో కలుషితమైపోయింది. మూసీ పునరుజ్జీవం చేపట్టాలంటే ముందుగా నది పరివాహక ప్రాంతంలోని ఆక్రమణలను తొలగించడంతో పాటు నదిలో పారబోస్తున్న కలుషితాలను అడ్డుకోవడం ప్రధాన లక్ష్యం. ఇప్పటికే తొలగించాల్సిన ఆక్రమణలను మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎంఆర్‌డీసీఎల్) అధికారులు గుర్తించారు. త్వరలోనే వాటిని తొలగించి, బాధితులకు పునరావాసం కల్పించనున్నారు. ఈమేరకు అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. మూసీ పునరుజ్జీవం కోసం రూ.14,100 కోట్ల ఆర్థిక సాయాన్ని కోరుతూ రాష్ట్ర సర్కారు కేంద్రానికి లేఖ రాసింది.

గాంధీ సరోవర్ లాగా..

కేదర్‌నాథ్‌లోని గాంధీ సరోవర్ లాగా బాపూఘాట్‌ను అభివృద్ధి చేయాలని సీఎం నిర్ణయించారు. ఉస్మాన్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు 11.5 కి.మీ., అలాగే హిమాయత్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు ఉన్న 8.5 కి.మీ. మూసీ నదీ సుందరీకరణకు అధికారులు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. ఆయా మార్గంలో రక్షణ శాఖకు చెందిన 222.27 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించాలని కేంద్ర రక్షణ శాఖకు లేఖ రాశారు. అలాగే మూసీ నదిపై 11 చోట్ల హెరిటేజ్ బ్రిడ్జిలను నిర్మించనున్నారు. రూ.1,000 కోట్ల నిర్మాణ వ్యయాన్ని అంచనా వేశారు. ఇప్పటికే బాపూఘాట్ వద్ద మూసీ పునరుజ్జీవం పనులకు డీపీఆర్ రూపొందగా.. ఆమోదం కోసం కేంద్రానికి రాష్ట్ర పభుత్వం పంపించింది. ఈ ఏడాది బాపూఘాట్ వద్ద 90 శాతం పనులను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

సొంతూరికి వెళ్లొచ్చే సరికే..

ఇంటి తాళాలు పగులుగొట్టి బంగారం, వెండి ఆభరణాల చోరీ


క్లూస్ టీంతో ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

అబ్దుల్లాపూర్‌మెట్: ఇంటి తాళాలు ధ్వంసం చేసిన దుండగులు బీరువాలోని బంగారు, వెండి ఆభరణాలతో పాటు, నగదును అపహరించుకుపోయిన సంఘటన స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ అంజిరెడ్డి తెలిపిన కథనం ప్రకారం.. మండలంలోని కవాడిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఉదయ్ గార్డెన్ కాలనీలో నీరుడు సతీష్ కుటుంబ సభ్యులు నివాసం ఉంటున్నాడు. ఆయన సోమవారం రాత్రి ఇంటికి తాళం వేసి స్వగ్రామమైన యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి మండలం జూలూరులో జరిగే జాతరకు వెళ్లాడు. తిరిగి మంగళవారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా.. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు ధ్వంసం చేసి లోపలి ప్రవేశించినట్లు గుర్తించాడు. బీరువాలో ఉన్న 4 తులాల బంగారం, 80 తులాల వెండి వస్తువులు, నగదు దొంగిలించినట్లు నిర్ధారించుకున్నాడు. దాదాపు రూ.6.5 లక్షల విలువగల సొత్తును తస్కరించారని సతీష్ విలపించాడు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


వినయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఆర్డీఓ చంద్రకళ తదితరులు

గ్రూప్స్‌లో సత్తాచాటిన వినయ్, చంద్రకాంత్

చేవెళ్ల: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న వినయ్‌కుమార్ గ్రూప్– 1లో 483వ ర్యాంకు, జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న చంద్రకాంత్ గ్రూప్– 2లో 27వ ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ చంద్రకళ, డిప్యూటీ తహసీల్దార్ రాజశేఖర్, చేవెళ్ల తహసీల్దార్ కృష్ణయ్య తదితరులు వారిని శాలువాలతో సన్మానించారు.

చంద్రకాంత్ తీన్మార్..


చంద్రకాంత్ ఇంట్లో సంబరాలు

ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే గగనంగా మారిన ప్రస్తుత సమయంలో చంద్రకాంత్ వరుసగా మూడోసారి సర్కారు కొలువును చేజిక్కించుకున్నాడు. శంకర్‌పల్లి మండలం కొత్తపల్లికి చెందిన ఒగ్గు విఠలయ్య, వినోద దంపతుల రెండు కుమారుడైన ఈయన పీజీ పూర్తి చేసి, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యాడు. ఈ క్రమంలో జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయి 3వ ర్యాంకు, గ్రూప్– 4లో 27వ ర్యాంకు సాధించాడు. ప్రస్తుతం చేవెళ్ల ఆర్డీఓ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. తాజాగా గ్రూప్– 2 ఫలితాల్లోనూ 27వ ర్యాంకుతో ఉన్నత ఉద్యోగానికి ఎంపికయ్యాడు. తన తల్లిదండ్రుల కష్టాన్ని చూసి పట్టుదలతో బాగా చదివానని చంద్రకాంత్ తెలిపారు.

ఆ లింక్‌లు ఓపెన్ చేయొద్దు

- రిజర్వు బ్యాంకు అధికారులు సావిత్రి, రెహమాన్
- తులేకలాన్‌లో డిజిటల్ చెల్లింపులపై అవగాహన సదస్సు


మాట్లాడుతున్న రిజర్వు బ్యాంకు అధికారి సావిత్రి

ఇబ్రహీంపట్నం రూరల్: ఆఫర్ల పేరుతో ఆన్‌లైన్‌లో వచ్చే తెలియని లింక్‌లని ఓపెన్ చేసి మోసపోవద్దని భారతీయ రిజర్వు బ్యాంకు అధికారులు ఎ.సావిత్రి, ఎ.రెహమాన్ సూచించారు. తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని తులేకలాన్ గ్రామంలో డిజిటల్ లావాదేవిలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రిజర్వు బ్యాంకు అధికారులు హాజరై మాట్లాడుతూ.. అపరిచిత లింక్‌లు కలిగి ఉన్న ఎస్‌ఎంఎస్, ఈమెయిల్‌ని వెంటనే డిలిట్ చేయాలన్నారు. ఆర్థిక వివరాల ధ్రువీకరణ కోరే వెబ్‌సైట్‌ను నిర్ధారించుకోవాలన్నారు. వ్యక్తిగత వివరాలని లేదా బ్యాంకు సమాచారాన్ని సోషల్ మీడియాలో పంచుకోవద్దని సూచించారు. తెలియని లింక్‌లను క్లిక్ చేయడంతో మీ బ్యాంకు ఖాతా ఖాళీ అవుతుందన్నారు. డబ్బులు అడిగే అపరిచిత వ్యక్తుల కాల్స్, ఈమెయిల్స్‌లకి సమాధానం ఇవ్వొద్దన్నారు. పెద్ద మొత్తంలో రాబడుల ఆశ చూపేవారి వెబ్‌సైట్స్ యాప్‌ల వివరాలని తనిఖీ చేసుకోవాలన్నారు. క్యూఆర్ కోడ్ ఉపయోగించి చెల్లింపులు చేసే సమయంలో స్క్రీన్‌పై పేరు సరి చూసుకోలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు సీనియర్ మేనేజర్(ఆపరేషన్స్) మురళికృష్ణ, అధికారులు సుధాకర్, బాలవెంకటేశ్వర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్ ఫలితాల విడుదల సరికాదు

- ప్రభుత్వం మాదిగలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి
- ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నర్సింహ


దీక్ష చేపట్టిన నాయకులు

షాద్‌నగర్: ప్రభుత్వం మాదిగలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహ డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ చట్టం అమలయ్యే వరకు గ్రూప్ పరీక్షల ఫలితాలను నిలుపుదల చేయాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో షాద్‌నగర్ పట్టణంలో నిరాహార దీక్ష చేపట్టారు. రెండో రోజు మంగళవారం దీక్షా శిబిరానికి విచ్చేసిన సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింహ మాట్లాడుతూ... ఎస్సీ వర్గీకరణ అంశంపై అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని గుర్తు చేశారు. వర్గీకరణ ప్రక్రియ పూర్తి చేయకుండానే ప్రభుత్వం గ్రూప్ ఫలితాలను విడుదల చేయడం సరికాదన్నారు. లోపాలను సవరించకుండా ప్రభుత్వం వివిధ శాఖల్లో ఉద్యోగాల నియామకాలకు నోటిఫికేషన్లు జారీ చేయడం తగదన్నారు. దీంతో మాదిగ, మాదిగ ఉపకులాలకు అన్యాయం జరుగుతుందన్నారు. ఎస్సీ వర్గీకరణ చట్టం అయ్యేంత వరకు ఉద్యోగ నియామకాలు ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రావణ్, నాగభూషణ్, సురేష్, పాండు, మహేందర్, సుదర్శన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బిల్డర్ ఇంట్లో చోరీకి పాల్పడ్డ మహిళల అరెస్టు


పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు, నగలు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–22లో నివసించే ప్రముఖ బిల్డర్, జీవీబీఆర్ నిర్మాణ రంగ సంస్థ ఎండీ జీవీ శేఖర్‌రెడ్డి ఇంట్లో భారీగా నగలు, నగదు చోరీ చేసిన ఘటనలో ఐదుగురు మహిళలను జూబ్లీహిల్స్ పోలీసులు మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే..శేఖర్‌రెడ్డి ఇంట్లో గత రెండు సంవత్సరాల నుంచి హసీనా, వహీదా, అనూష అనే ముగ్గురు యువతులు పనిచేస్తున్నారు. నాలుగు రోజుల క్రితం యజమాని బెడ్‌రూమ్‌లో డ్రెస్సింగ్ టేబుల్ నుంచి రూ.7.50 లక్షల నగదు, రూ.28.50 లక్షల విలువ చేసే నగలు చోరీ చేశారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ క్రైమ్ పోలీసులు రంగంలోకి దిగి అనుమానితులు హసీనా, వహీదా, అనూషలను విచారించారు. వహీదా తాను చోరీ చేసిన ఆభరణాలను తన తల్లి సలీమాకు పంపించింది. అలాగే అనూష రూ.3 లక్షల నగదు తన తల్లి ఆదిలక్ష్మికి పంపించింది. డబ్బుపై ఆశతో హసీనా తనతో పాటు పనిచేస్తున్న వహీదా, అనూషలను రెచ్చగొట్టి ఈ దొంగతనానికి ఉసిగొల్పింది. ముగ్గురూ కలిసి యజమాని కళ్లుగప్పి చేతివాటం ప్రదర్శించారు. నగలు అమ్ముకుని, తలాకొంత పంచుకుని ఏదైనా వ్యాపారం చేస్తే మరింత మెరుగైన జీవితం గడపవచ్చని హసీనా ఈ ఇద్దరికి నూరిపోసింది. డబ్బులతో తమ బతుకులు మార్చుకుందామని, మరింత బాగా బతకవచ్చని భావించిన వహీదా, అనూషలు కూడా ఈ దొంగతనంలో పాలుపంచుకున్నారు. ఈ ఘటనలో హసీనా, వహీదా, అనూషలతో పాటు సలీమా, ఆదిలక్ష్మిలను కూడా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వీరి నుంచి మొత్తం నగలు, రూ.4 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుడిలో చోరీ..12 గంటల్లో దొంగల పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సురేష్‌కుమార్

జీడిమెట్ల: గుడిలో దొంగతనానికి పాల్పడిన ఇద్దరు దొంగలను జీడిమెట్ల పోలీసులు 12 గంటల వ్యవధిలో పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. మంగళవారం జీడిమెట్ల పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాలానగర్ డీసీపీ కె.సురేష్‌కుమార్, ఏసీపీ హన్మంత్‌రావు, జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ మల్లేష్, డీఐ కనకయ్యలతో కలిసి వివరాలను వెల్లడించారు. లంగర్‌హౌజ్, టోలీచౌకి ప్రాంతానికి చెందిన ఇద్దరు దొంగలు సోమవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో గాంధీనగర్‌లోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలోకి ప్రవేశించి..గర్భగుడి తలుపులు తెరిచి పంచలోహ విగ్రహాలు, ఇతర పూజా వస్తువులు ఎత్తుకెళ్లారు. ఉదయం గుడికి వెళ్లిన ఆలయ అధ్యక్షుడు కోనేటి వీరవెంకట సత్యనారాయణ దొంగతనం విషయాన్ని తెలుసుకుని సీసీ టీవీ ఫుటేజీ పరిశీలించారు. ఇద్దరు వ్యక్తులు చోరీకి పాల్పడిన దృశ్యాలను గమనించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీసీపీ సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో మూడు బృందాలుగా విడిపోయి...సీసీ కెమరాల పరిశీలనతో పాటు టెక్నికల్‌గా విచారణ జరిపి సాయంత్రం 7 గంటల వరకు ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం ఉదయం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించి ఇద్దరిని రిమాండుకు తరలించారు. వారి నుండి రూ.95 వేలు విలువచేసే పంచలోహ విగ్రహాలు, వస్తువులు, రాగి సామాన్లు స్వాధీనం చేసుకున్నారు. కాగా గుడిలో చోరీ విషయం తెలిసి స్థానికులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. పోలీసులు వారికి నచ్చచెప్పి శాంతింపజేశారు. కాగా మంగళవారం ఉదయం గాంధీనగర్‌లో పోలీసులు పెద్ద ఎత్తున బలగాలను మోహరించారు. హిందూవాహిని ఆధ్వర్యంలో ప్రజలు పెద్దఎత్తున గాంధీనగర్ చేరుకుని నిరసనలో పాల్గొన్నారు. పోలీసులు వెంట వెంటనే ఆందోళన చేపట్టిన వారిని జీడిమెట్ల స్టేషన్‌కు తరలించి కొంతమందిని ఇళ్లవద్దనే హౌజ్ అరెస్టు చేశారు. ఈ క్రమంలో ఆందోళనకారులు ఉరుకులు పరుగులు పెట్టడంతో పోలీసులు స్వల్పంగా లాఠీ చార్జీ చేశారు.

దొంగను వదిలేసి.. పోలీసులను బాదేసి!

షాద్‌నగర్: ఇటీవల జరుగుతున్న చోరీల నేపథ్యంలో.. గస్తీ కాస్తున్న కాలనీవాసులకు సోమవారం రాత్రి ఓ దొంగ దొరికాడు. అతన్ని పట్టుకుని దేహశుద్ధి చేస్తున్న సమయంలో అక్కడికి చేరుకున్న పెట్రోలింగ్ పోలీసులు వారినుంచి దొంగను విడిపించే ప్రయత్నం చేశారు. దీనిపై ఆగ్రహానికి గురైన స్థానికులు దొంగను వదిలేసి పోలీసులపై దాడికి పాల్పడ్డారు. ఇదే అదనుగా భావించిన దొంగ క్షణాల్లో పరారయ్యాడు. ఆసక్తికరమైన ఈ సంఘటన షాద్‌నగర్ పట్టణంలోని తిరుమల టౌన్‌షిప్‌లో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఓ కానిస్టేబుల్‌కు స్వల్పంగా గాయాలైనట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన వివరాలను పోలీసులు గోప్యంగా ఉంచుతున్నారు. అసలు స్థానికులు పోలీసులపై ఎందుకు దాడి చేశారనేది ప్రశ్నార్థకంగా మారింది.

నిందితుల రిమాండ్

షాద్‌నగర్: ప్రైవేటు పాఠశాలలో విద్యార్థి భవనం పై నుంచి కింద పడిన మృతి చెందిన కేసులో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. షాద్‌నగర్ పట్టణంలోని శాస్త్ర పాఠశాలలో గత నెల 5న నీరజ్ అనే వ్యక్తి భవనం పై నుంచి పడి చనిపోయాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. విద్యార్థి మృతికి కారణమైన పాఠశాల ప్రిన్సిపాల్ నరేంద్రరాయ్, పీఈటీ కరుణాకర్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఠాణాలో దాడి చేసిన వ్యక్తి అరెస్టు

షాద్‌నగర్: ప్రేమించి పెళ్లి చేసుకున్న ఓ యువకుడిపై పోలీస్‌స్టేషన్ ఆవరణలో దాడికి పాల్పడిన ఓ వ్యక్తిని అరెస్టు చేసి మంగళవారం సాయంత్రం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. గత రెండు రోజుల క్రితం పట్టణానికి చెందిన ఓ యువతి, షాబాద్‌కు చెందిన నాని అనే యువకుడి ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. రక్షణ కల్పించాలని కోరుతూ వారు ఇటీవల షాద్‌నగర్ పోలీసులను ఆశ్రయించారు. కుటుంబ సభ్యులను పిలిచి మాట్లాడుతుండగా యువతి తరఫు మేనమామ రాజేష్ ద్విచక్రవాహనానికి సంబంధించి తాళంతో నాని గొంతుపై పోలీస్‌స్టేషన్ ఆవరణలో దాడి చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దాడికి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్ల అరెస్ట్

చార్మినార్: గంజాయి రవాణాతో పాటు విక్రయాలు జరుపుతున్న ముగ్గురు అంతర్రాష్ట స్మగ్లర్లను సౌత్–ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.11.30 లక్షలు విలువ చేసే 30.70 కేజీల ఎండు గంజాయి, 3 మొబైల్ ఫోన్లు, 2 ట్రాలీ బ్యాగులను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ అదనపు డిప్యూటీ కమిషనర్ అందె శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. హుస్సేనీ ఆలం ఠాణా పరిధిలోని ముర్గీచౌక్‌లో మహమ్మద్ యాసిన్ ఇంటిపై సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి 30.70 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఉత్తరప్రదేశ్ రాంపూర్ ప్రాంతానికి చెందిన మహమ్మద్ యాసిన్ సిటీకి బతుకుదెరువు కోసం వచ్చి ముర్గీచౌక్‌లో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. అధికంగా డబ్బు సంపాదించాలనే ఆశతో ఒడిశాకు చెందిన గోపాల్ ఖరా, ఉత్తమ్ తామెల్‌తో కలిసి గంజాయి వ్యాపారం ప్రారంభించారు. కొద్దిరోజుల క్రితం యాసీన్ ఒడిశాకు వెళ్లి అక్కడ గోపాల్, ఉత్తమ్‌ల సాయంతో 30 కిలోల గంజాయి కొనుగోలు చేశాడు. వారితో పాటు హైదరాబాద్‌కు తిరిగి వచ్చాడు. ధూల్‌పేటలోని కస్టమర్‌కు గంజాయి అందజేయడం కోసం నిల్వ చేశాడు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

EDUCATION
■ రెగ్యులర్ & డిస్టెన్స్: డిగ్రీ, PG, డిప్లొమా, B.Tech, D-ఫార్మసీ, B-ఫార్మసీ, GNM నర్సింగ్, B.Ed, B.P.Ed, MBA, MCA, PhD. (4 నెలల్లో పూర్తి) Dr.J.S అకాడమి (ISO సర్టిఫైడ్) 8886977112 [HA-15117]

Real Estate

FOR SALE
■ For sale A Good Running Hotel (B/F Lunch and Dinner) Hi Tention Line, Sainikpuri. Contact 9142426426 [SCA25002097]

HOUSE FOR SALE
■ హయత్‌నగర్ మునగనూరు బ్యాంక్ కాలనీలో 200 చ॥గ॥ S/F 1600 Sft కొత్త ఇల్లు అమ్మకానికి కలదు. త్రాగునీరు. డ్రైనేజీ కూడా కలదు. కేవలం 95L. Ph: 9849688626. HA-2992]

PLOT FOR SALE
■ 13499/–కే గ॥ HMDA అప్రూవ్డ్ కొంగరకలాన్ ఫాక్స్ కాన్ కలెక్టరేట్ TCS ఏరోస్పేస్ దగ్గరలో న్యూ వెంచర్లో ప్లాటు. Bank లోన్ avil. 8309376230 [HA-1198]
■ Shadnagar: Burgula (vi) DTCP 243 Sq.yds (E/F) 60ft Road Plot for Sale. (Spot Registration) Clear Title. Ph:9701005521 [SCA25002112]

Services

BUSINESS SERVICE
■ మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్: 9100329739 [H-800526]

పౌల్ట్రీ ధరలకే అమ్మబడును. అన్ని రకాల ఫంక్షన్లకు మార్కెట్ ధర కంటే
పావని చికెన్ సెంటర్

BUSINESS OFFER
■ Hyd లో Own House ఉన్న వారికి Govt Employee surety/ ITRS లేకుండా 5 లక్షల నుండి 50 లక్షల కమిట్‌మెంట్ చిట్స్ ఇవ్వబడును. 9160084120 [HA-15488]
■ మీరు లాభదాయకమైన వ్యాపారాన్ని ప్రారంభించండి, లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబి డైపర్ మెషిన్, ప్లాస్టిక్ ఉద్యోగ్ స్థాపించండి, బైబ్యాక్ అగ్రిమెంట్‌తో (ప్రభుత్వంచే ఆమోదించబడినది) సంప్ర॥ 8376001873, 9643010487, 8376089771, 011-25920179 [DA-6239]

PERSONAL CARE

CHANGE OF NAME
■ I, PRARTHANA SINGH BAYAS D/o. Prashant Singh Bayas R/o: H. No: 2-2-18/18/5/B, Street No:11, DD Colony, Bagh Amberpet, Hyderabad-500013, Telangana. Have Changed My Name As "PRARTHANA" [HA-15162]
■ I, Sykam Pitchaiah S/o Sykam Gurava Reddy R/o Flat - 405, Sri Dinesh Castle, Nizampet, Medchal-Malkajgiri, Telangana 500090. have changed my name to Sykam Pitchi Reddy for all purposes. [HA-13535]
■ I, PAYILI RENUKA W/O. PATHIPAKA VENKATA VARA PRASADA RAO R/O: 4-11-55/6 WP Information Cly Hayathnagar RR, TS. Change my surname as PAYILI RENUKA to PATHIPAKA RENUKA [SCA25002108]
■ I, MAANPATEL SURENDER S/o. M.Shiva Kumar, R/o. H.No.31-237, Indira Nagar, Kanajiguda, Trimul-gherry, Medchal Malkajgiri Dist- 500015, have changed my name from MUDHIRAJ SURENDER to MAANPATEL SURENDER for all records purpose. [HA-00084]
■ I, ZUBEDA BEGUM, W/o. Mohammed Naseeruddin, R/o. H.No. 2-17-68, SBH Colony, Uppal, Hyderabad, Telangana – 500039, have changed my name from ZUBADA BEGUM to ZUBEDA BEGUM for all records purpose. [HA-00084]

OLD AGE HOME
■ వృద్ధులు, NRI'S, విలాసవంతమైన గదులు, లిఫ్ట్, మేడివల్లి, దీర్ఘకాలిక మంచానసున్న వారికి 24/7 మెడికల్ సర్వీసెస్. ఉప్పల్ & ECIL-కీసర రోడ్, చీర్యాల్ X రోడ్, భోజన వసతితో. 7981467036, 9391039990, 9949520296 [H-783368]

TOURS & TRAVELS
■ 16/04/25 – అయోధ్య, కాశీ, నేపాల్, ముక్తినాథ్ యాత్ర & 09/05/25 – సరస్వతి పుష్కరాలు, చార్‌ధామ్ యాత్ర. రై+బ+భో+వ. భాగ్యలక్ష్మి టూర్స్. ఫోన్: 9397617094 [HA-00057]

Wanted
■ నెట్‌వర్క్ లీడర్స్, LIC ఏజెంట్స్ కావలెను. కేవలం 1680/– ఒకసారి పెట్టుబడితో సొంత వ్యాపారం ప్రారంభించి ఎర్న్ 3K - 30K. రోజా 9948828641 [SCA25002106]
■ నెట్‌వర్క్ లీడర్స్, LIC ఏజెంట్స్ కావలెను. కేవలం 1680/- ఒకసారి పెట్టుబడితో సొంత వ్యాపారం ప్రారంభించి 3K-30K సంపాదించండి. 9948208005 [SCA25002017]
■ ప్రముఖ ఎలక్ట్రానిక్స్ షోరూం నందు పనిచేయుటకు ఆఫీస్ బాయ్స్, క్యాషియర్స్, డిస్పాచర్స్, కస్టమర్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. జీతం 15000 – 21000. అడ్రస్: పిల్లర్ నెం.ఎ119, నిమ్స్ హాస్పిటల్ ఎదురుగా, ఎల్‌జి షోరూం పైన 2వ ఫ్లోర్. Contact / Whatsapp: 8977514045 [SCA25002104]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
సాక్షి క్లాసిఫైడ్స్
3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి
హైదరాబాద్ సిటీ ఎడిషన్‌లో 5 ప్రకటనలకు రూ. 2280/- (4 లైన్లు). ప్రతి అదనపు లైనుకు రూ. 540/-
గమనిక : జతపై మీరు ఇచ్చే అన్ని ప్రకటనలపై 5% GST అదనం

జోన్ సెంటర్స్

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజ్‌గిరి	9505507562
చిక్కడపల్లి	9912225453	మెహదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9912225453
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

వివరాలకు : 6-2-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం. 1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34
Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453